తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ మంగళవారం 06 - 10 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 2

# రూ.15 కోట్లకు సింగిల్ టెండర్

## సింగిల్ టెండర్ వేసిన హైదరాబాద్‌కు చెందిన వెల్ టెక్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ




- ❖ రూ.11.63 కోట్లతో చేపట్టే పనులకు టెండర్ నోటిఫికేషన్
- ❖ గత నెల 24న నోటిఫికేషన్..ఈనెల 3న సాయంత్రంతో క్లోజ్
- ❖ అన్నీ సక్రమంగా ఉంటేనే ఫైనల్ అంటున్న అధికారులు
- ❖ ఎమ్మెల్యే, కాంగ్రెస్ కౌన్సిలర్ల మధ్య 7 నెలలుగా కొనసాగుతున్న వివాదం

**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు మున్సిపాలిటీలో రూ.15 కోట్ల నిధులకు సంబంధించి చేపట్టే పనులకు మున్సిపల్ అధికారులు ముచ్చటగా మూడోసారి పిలిచిన టెండర్ నోటిఫికేషన్‌కు సింగిల్ టెండర్ (ఒక్క కాంట్రాక్టర్ మాత్రమే) దాఖలైంది. హైదరాబాద్‌కు చెందిన వెల్ టెక్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ మాత్రమే సింగిల్ టెండర్ వేసినట్టు తెలిసింది. రూ.15 కోట్ల నిధుల్లో మున్సిపల్ అధికారులు రూ.11 కోట్ల 63 లక్షల 22277 నిధులతో చేపట్టే పనులకు గత నెల 24న సింగిల్ టెండర్ నోటిఫికేషన్ వేశారు. ఈనెల 3న సాయంత్రం 4.30తో టెండర్ గడువు ముగిసే సమయానికి ఒకే ఒక్క కాంట్రాక్టర్ మాత్రమే టెండర్ వేశారు. మున్సిపల్ ఎన్నికలకు ముందు మోత్కూరు మున్సిపాలిటీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.15 కోట్ల నిధులు మంజూరు చేసింది. మున్సిపల్ ఎన్నికలకు ముందే ఆ నిధులతో మున్సిపాలిటీలో చేపట్టే పనులను తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఖరారు చేయగా మున్సిపల్ అధికారులు టెండర్ నోటిఫికేషన్ వేశారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత ఆ నిధులపై ఎమ్మెల్యే సామేల్, కాంగ్రెస్ కౌన్సిలర్ల మధ్య వివాదం నెలకొనడంతో అప్పటికే సింగిల్ టెండర్‌తో ఎమ్మెల్యే అనుచరుడు పనులు దక్కించుకోవడంతో మెజార్టీ కౌన్సిలర్లు వ్యతిరేకించి తీర్మానం చేయగా టెండర్ రద్దయ్యింది. మళ్లీ రెండోసారి జూన్ 29న టెండర్ నోటిఫికేషన్ వేయగా జూలై 6 చివరి తేదీ వరకు ఒక్కరు కూడా టెండర్ వేయకపోవడంతో అదీ రద్దయ్యింది. ఆ నిధులకు సంబంధించి టెండర్ ప్రక్రియ, పనుల పురోగతి లేకపోవడంతో సీడీఎంఏ మున్సిపల్ కమిషనర్ నర్సయ్యకు మెమో కూడా జారీ చేసింది. దీంతో కౌన్సిలర్లకు సమాచారమిచ్చిన ఆయన సెప్టెంబర్ 24న టెండర్ నోటిఫికేషన్ వేసి అక్టోబర్ 3న సాయంత్రం 4.30తో టెండర్లు దాఖలు చేసేందుకు గడువు పెట్టి నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన వెల్ టెక్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ మాత్రమే సింగిల్ టెండర్ దాఖలు చేసింది. నిబంధనల ప్రకారం టెండర్ వేశారా.. అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నాయా లేదా అన్నది పరిశీలించడానికి టెండర్‌ను మున్సిపల్ పబ్లిక్ హెల్త్ అండ్ ఇంజనీరింగ్ శాఖ నల్లగొండ ఎస్ఈకి పంపుతామని, అక్కడి నుంచి స్టేట్ ఈఎన్‌సీకి పంపిన తర్వాత ఉన్నతాధికారుల పరిశీలన అనంతరమే ఆ టెండర్‌పై తుది నిర్ణయం తీసుకుంటారని మున్సిపల్ పబ్లిక్ హెల్త్ అండ్ ఇంజనీరింగ్ ఏఈ సురేష్ తెలిపారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే సామేల్, కాంగ్రెస్ కౌన్సిలర్ల మధ్య ఈ నిధులపై 7 నెలలుగా వివాదం కొనసాగుతోంది. మున్సిపాలిటీ డెవలప్‌మెంట్‌తో ముడిపడిన అంశం కావడంతో ఇటు ఎమ్మెల్యే అటు కౌన్సిలర్లు కాంప్రమైజ్ అవుతారా..లేదా అన్నది చూడాలి.